సాక్షి
పశ్చిమగోదావరి

శుక్రవారం । 15 । మార్చి । 2024




కఠినంగా శిక్షించాలి

గీతాంజలి మృతికి కారణమైన టీడీపీ, జనసేన సోషల్ మీడియా సభ్యులను తక్షణం అరెస్ట్ చేయాలని పాలకొల్లు, ఏలూరులో కొవ్వొత్తుల ర్యాలీలు జరిగాయి. 10లో ▸



'లక్ష'ణంగా గోరుముద్ద

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన పోషక విలువలతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని జగనన్న గోరుముద్ద పథకం ద్వారా అందిస్తున్నారు. 10లో ▸



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శుక్ర (సాయంత్రం)	సహరి శని (ఉదయం)
భీమవరం	6.20	4.53
ఏలూరు	6.20	4.49

న్యూస్‌రీల్

కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట ఏర్పాట్లు



సూచనలిస్తున్న జేసీ ప్రవీణ్ ఆదిత్య

భీమవరం: సార్వత్రిక ఎన్నికల కోసం భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో కౌంటింగ్, ఈవీఎం పంపిణీ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల కోసం ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని జేసీ, ఉండి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సీవీ ప్రవీణ్‌ఆదిత్య ఆదేశించారు. గురువారం కళాశాలలో ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఏర్పాట్లపై ముందస్తు చర్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళాశాలలో సెక్యూరిటీ, సీసీ కెమెరాలతోపాటు అన్ని రకాల మౌలిక వసతులను కల్పించాలన్నారు. ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా జరిగేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు, కౌంటింగ్ కేంద్రాల బాధ్యత ఆయా సెక్టార్ అధికారులదేనని అందరూ బాధ్యతతో విధులు నిర్వహించాలన్నారు. జిల్లా సర్వే అధికారి కె.జాషువా, ఆర్అండ్‌బీ అధికారి ఎస్.లోకేశ్వరరావు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ మహేశ్వరరావు

భీమవరం(ప్రకాశం చౌక్): లింగ నిర్ధారణ పరీక్షలు చేసినా, ప్రోత్సహించినా చట్టరీత్యా నేరమని, అటువంటి కార్యక్రమాలకు పాల్పడితే కేంద్రాలను సీజ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని డీఎంహెచ్ఓ, లింగ నిర్ధారణ నిరోధక చట్టం జిల్లా కమిటీ చైర్మన్ డాక్టర్ డి.మహేశ్వరరావు అన్నారు. గురువారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో డిస్ట్రిక్ట్, సబ్ డిస్ట్రిక్ట్ స్థాయి లింగ నిర్ధారణ నిరోధక చట్టం కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని స్కానింగ్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో 9 స్కానింగ్ సెంటర్ల పునరుద్ధరణ, 7 స్కానింగ్ సెంటర్లలో మార్పులు, 4 కొత్త రిజిస్ట్రేషన్లు ప్రక్రియపై సమావేశంలో చర్చించారు. సబ్ డిస్ట్రిక్ట్ కమిటీ చైర్మన్ బి.భానునాయక్, కమిటీ కన్వీనర్ డీఐఓ డి.సుధాలక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.

గోనె సంచుల కొరత రానివ్వొద్దు

భీమవరం: రబీ ధాన్యం కొనుగోళ్లకు ముందస్తు చర్యలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించారు. జిల్లాలో 2.2 లక్షల ఎకరాల్లో వరి పంట వేయగా సుమారు 8 లక్షల టన్నుల ధాన్యం సేకరించే అవకాశం ఉందని, ఈ మేరకు గోనె సంచుల కొరత లేకుండా చూడాలన్నారు. జిల్లాలోని 211 రైస్ మిల్లుల యాజమాన్యంతో సమన్వయం చేసుకొని ముందుకు సాగాలన్నారు. ధాన్యం రవాణా వాహనాలకు జీపీఎస్ ఏర్పాటుతో పాటు జియో ట్యాగింగ్ పూర్తి చేయాలన్నారు. సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ టి.శివరామ ప్రసాద్, జిల్లా పౌరసరఫరాల అధికారి ఎన్.సరోజ, జిల్లా కో-ఆపరేటివ్ అధికారి ఎం.నాగరాజు, జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 96 శాతం హాజరు

భీమవరం: జిల్లాలోని 50 పరీక్షా కేంద్రాల్లో గురువారం నిర్వహించిన ఇంటర్ పరీక్షలకు 96 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని ఆర్ఐఓ కె.చంద్రశేఖర్‌బాబు తెలిపారు. ఫస్టియర్ కెమిస్ట్రీ, కామర్స్, ఒకేషనల్ పరీక్షలు జరిగాయన్నారు. జనరల్ విద్యార్థులు 16,951 మందికి 16,416 మంది, ఒకేషనల్ విద్యార్థులు 1,557 మందికి 1,325 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని చంద్రశేఖర్‌బాబు తెలిపారు.

కొనసాగిన ఇంటర్ పరీక్షలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు జిల్లాలోని 51 కేంద్రాల్లో గురువారం ఇంటర్మీడియెట్ ఫస్టియర్ కెమిస్ట్రీ, కామర్స్–1 పరీక్షలకు 16,049 మంది విద్యార్థులకు 15,026 మంది హాజరయ్యారు. వీరిలో 14,007 మంది జనరల్ విద్యార్థులకు 13,452 మంది, 2,042 మంది ఒకేషనల్ విద్యార్థులకు 1,574 మంది హాజరయ్యారు. 94 శాతం హాజరు నమోదైందని, ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగలేదని జిల్లా వృత్తి విద్యా అధికారి, పరీక్షల కన్వీనర్ బి.ప్రభాకరరావు తెలిపారు.

● జనసేన దారెటు ?

అరువు నేతలే దిక్కు

- టీడీపీ మాజీ ఎమ్మెల్యే అంజిబాబుకు జనసేన టికెట్
- భీమవరంలో రగిలిపోతున్న జనసేన కేడర్
- జనసేనకు ఆరు సీట్లపై టీడీపీలో అసమ్మతి రాగం
- ఉంగుటూరు, తాడేపల్లిగూడెం 'దేశం'లో నైరాశ్యం
- నరసాపురంలోనూ ఇదే పరిస్థితి
- 'పశ్చిమ'లో తారాస్థాయికి 'పొత్తు' రగడ



సాక్షి ప్రతినిధి, ఏలూరు: జనసేన నాయకులను కాదని పక్క పార్టీ నేతలను ముందురోజు చేర్చుకుని వాళ్లనే జనసేన అభ్యర్థిగా ప్రకటించడం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు రాజకీయాలకు అద్దం పడుతోంది. పొత్తులో భాగంగా జనసేనకు టికెట్ కేటాయించినా అప్పటివరకు పక్క పార్టీలో ఉన్న నేతకు కండువా వేసి వారే ఆ నియోజకవర్గ జనసేన అభ్యర్థిగా ప్రకటించడంతో పార్టీ శ్రేణులు, ప్రజలు కంగుతింటున్నారు. మూడు రోజుల క్రితం వరకు తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా ఉన్న భీమవరం మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ఓవర్‌నైట్‌లో జనసేన జెండా కప్పుకుని అభ్యర్థిత్వం దక్కించుకుని భీమవరం నియోజకవర్గం నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా బరిలో నిలిచారు.

టీడీపీ గరంగరం : ఉమ్మడి జిల్లాలో పొత్తుల్లో భాగంగా జనసేనకు ఆరు టికెట్లు కేటాయించడంపై టీడీపీ కేడర్ రగిలిపోతున్నారు. ఉంగుటూరు, నరసాపురం, తాడేపల్లిగూడెం, పోలవరంలో రెండు, మూడు రోజులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేసి నానా హడావుడి చేశారు. కట్ చేస్తే.. పార్టీ పట్టించుకోకపోవడంతో ఏం చేయాలో అర్థం కాని రీతిలో తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారు. పొత్తుల్లో భాగంగా పశ్చిమగోదావరి జిల్లాలో జనసేన అభ్యర్థులను పవన్‌కళ్యాణ్ ప్రకటించారు. అసెంబ్లీ స్థానాల వారీగా నరసాపురానికి జనసేన నేత బొమ్మిడి నాయకర్, తాడేపల్లిగూడేనికి జనసేన నేత బొలిశెట్టి శ్రీనివాస్, ఉంగుటూరుకు జనసేన నేత పత్సమట్ల ధర్మరాజు, భీమవరానికి అరువు నేత పులపర్తి రామాంజనేయులను అభ్యర్థులుగా బుధవారం ప్రకటించారు. గత వారం రోజుల నుంచి జనసేన, టీడీపీ మధ్య టికెట్ కోసం నడిచిన అంతర యుద్ధానికి తెరపడినా టీడీపీ కేడర్ మాత్రం జీర్ణించుకోలేని స్థితిలో ఉన్నారు. జనసేన పార్టీ ఆవిర్భవించాక ఉమ్మడి జిల్లాలో ఒక్క స్థానం కూడా దక్కించుకోని పార్టీకి ఏకంగా ఆరు సీట్లు ఇవ్వడం వాళ్ల స్థాయికి మించిన వ్యవహారమని టీడీపీ కేడర్ బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

ఉంగుటూరు.. పట్టించుకోరు

ఉంగుటూరు టికెట్ ఆశించి భంగపడిన మాజీ ఎమ్మెల్యే, జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు రెండు రోజులు అనుచరులతో సమావేశాలు నిర్వహించి హడావుడి చేసి పార్టీ కేడర్‌తో కార్ల ర్యాలీని మంగళగిరికి ఏర్పాటుచేశారు. అయినా చంద్రబాబును కేడర్ కలవలేకపోయారు. పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉన్న ఒక చోటా నేతకు వినతిపత్రం ఇచ్చి ఉద్యమాన్ని సర్దుకున్నారు. అయితే మండల స్థాయిలో మాత్రం కేడర్ పూర్తిగా రగిలిపోతూ జనసేను పట్టించుకోని పరిస్థితి.

పోలవరం.. అయోమయం

పోలవరం టికెట్ జనసేనకు ఇస్తున్నాం.. సహకరించాలని చంద్రబాబునాయుడు టీడీపీ ఇన్‌చార్జి బొరగం శ్రీనివాస్‌కు ఫోన్ చేసి చెప్పడంతో రెండు రోజుల పాటు ఆందోళనలు, ఓ కార్యకర్త పెట్రోలు పోసుకుని హడావుడి చేశారు. కట్ చేస్తే.. జనసేనకు ఇంకా అభ్యర్థి ఎవరూ దొరక్కపోవడంతో టీడీపీలోని నేతలపై దృష్టి పెట్టి వారికి జనసేన కండువా కప్పి టికెట్ ఇచ్చే ప్రయత్నాలు సాగుతున్నట్టు సమాచారం.

బుజ్జగింపుల పర్వం

తాడేపల్లిగూడెం టీడీపీ ఇన్‌చార్జి వలవల బాబ్జికి చంద్రబాబు ఫోన్ చేసి సహకరించి సర్దుకోమని సూచించారు. నరసాపురంలో ఆశావహులు టీడీపీకి ఎక్కువగా ఉండటంతో ఇన్‌చార్జి పొత్తూరి రామరాజుకు ఫోన్ చేసి ఇక్కడా సర్దుకోమని సూచించారు. ఇదిలా ఉంటే నేతలందరికీ బుజ్జగింపుల పర్వంలో భాగంగా చంద్రబాబు ఫోన్ చేసి అధికారంలోకి రాగానే ప్రతి ఒక్కరికీ ఎమ్మెల్సీ ఇస్తామని చెప్పడం విశేషం. తాడేపల్లిగూడెం ఇన్‌చార్జి వలవల బాబ్జి తనకు ఎమ్మెల్సీ ఇస్తామని బాబు చెప్పారని మీటింగ్‌లో ప్రకటించగా, ఉంగుటూరు ఇన్‌చార్జి గన్ని వీరాంజనేయులు, పోలవరం ఇన్‌చార్జి బొరగం శ్రీనివాస్‌లకు ఎమ్మెల్సీ ఇస్తామని చెప్పారని కేడర్‌కు చెప్పుకోవడం కొసమెరుపు.

పట్టా స్థలానికి సర్వ హక్కులు



పెనుగొండలో లబ్ధిదారులకు దస్తావేజులు అందిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: నవరత్నాల్లో భాగంగా పేదలకు అందించిన ప్రభుత్వ ఇంటి స్థలానికి సంపూర్ణ హక్కులతో దస్తావేజులు ఇవ్వడం సీఎం జగన్ తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పు అని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. గురువారం స్థానిక కల్యాణ మండపంలో పెనుగొండ మండలంలో ఇంటి స్థలాలకు సంబంధించి దస్తావేజులు పంపిణీ చేశారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా పట్టా స్థలానికి దస్తావేజులు అందిస్తున్నామన్నారు. గత టీడీపీ హయాంలో ఇలాంటి ఆలోచన చేయలేదన్నారు. పెనుగొండలో కాలనీల్లో మౌలిక వసతుల కల్పనలో విఫలమైన టీడీపీ నాయకులు అభివృద్ధిపై మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. కనీసం రోడ్లు, విద్యుత్ దీపాలు కూడా ఏర్పాటుచేయలేదని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కోడిపందేల దిబ్బ, నగరేశ్వర స్వామి (బీడు) కాలనీల్లో రోడ్లు, విద్యుత్ వసతులు కల్పించామన్నారు. పెనుగొండలో ఇప్పటికీ ఇంటి నిర్మాణాలు చేపట్టని వారికి బ్యాంకు రుణాలు ఇప్పించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ పోడూరి గోవర్ధన, మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షురాలు దండు పద్మావతి, వైస్ ఎంపీపీ పాలపర్తి సుబ్రహ్మణ్యం, మండల కన్వీనర్లు నల్లిమిల్లి బాబిరెడ్డి, సాకా సుబ్రహ్మణ్యం, పలివెల శ్రీను, సర్పంచ్‌లు కడలి బేబీ అన్నపూర్ణ, యర్రంశెట్టి బుజ్జి, నల్లూరి సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి దంపనబోయిన బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్రవర్ణ పేదలకు ప్రభుత్వం అండ



భీమవరం కలెక్టరేట్‌లో లబ్ధిదారులకు చెక్కు అందిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

భీమవరం(ప్రకాశం చౌక్): అగ్రవర్ణాల పేద మహిళల ఆర్థికాభివృద్ధికి ఈబీసీ నేస్తం దోహదపడుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ అన్నారు. సీఎం జగన్ బనగానపల్లి వేదికగా మూడో విడత ఈబీసీ నేస్తం పథకాన్ని మీట నొక్కి ప్రారంభించగా.. ఈ కార్యక్రమాన్ని భీమవరం కలెక్టరేట్ నుంచి ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, అధికారులతో కలిసి కలెక్టర్ వర్చువల్‌గా వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏడు నియోజకవర్గాలకు చెందిన 13,024 మంది లబ్ధిదారులకు రూ.19.53 కోట్లు బ్యాంకు ఖాతాల్లో జమచేస్తామన్నారు. రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ, వెలమతోపాటు, ఇతర ఓసీ సామాజికవర్గాలు ఈ మొత్తాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం లబ్ధిదారులకు చెక్కు అందజేశారు.

నియోజకవర్గాల వారీగా..

నియోజకవర్గాల వారీగా ఆచంటలో 2,412 మందికి రూ.3.62 కోట్లు, భీమవరంలో 1,924 మందికి రూ.2.89 కోట్లు, నరసాపురంలో 461 మందికి రూ.69.15 లక్షలు, పాలకొల్లులో 1,345 మందికి రూ.2.02 కోట్లు, తాడేపల్లిగూడెంలో 1,882 మందికి రూ.2.82 కోట్లు, తణుకులో 3,036 మందికి రూ.4.55 కోట్లు, ఉండిలో 1,964 మందికి రూ.2.95 కోట్ల లబ్ధి చేకూర్చానున్నారు. బీసీ కార్పొరేషన్ ఏఈఓ కె.ప్రమీలా రాణి, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పట్నాల గౌరి పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం అభివృద్ధి లక్ష్యం

- రూ.244 కోట్లతో వసతుల కల్పన, అభివృద్ధి పనులు
- డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: ప్రజలకు అవసరమైన సౌకర్యాల కల్పన దిశగా పట్టణాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు గురువారం ఆయన శంకుస్థాపనలు చేశారు. పట్టణంలోని 12వ వార్డులో రూ.74.50 లక్షలతో రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తున్నామని చెప్పారు. కరకట్ట ప్రాంతవాసుల ఏళ్లనాటి కలను సాకారం చేస్తూ మంచినీటి పైపులు, కుళాయిలను ప్రారంభించారు. అనంతరం ఆయన కుంచనపల్లి శివారు కడియపు చెరువు వద్ద ఏర్పాటు చేస్తున్న రెండో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నిర్మాణానికి భూమి పూజ చేశారు. సీఎం జగన్ సహకారంతో సుమారు 54 ఎకరాల్లో నాలుగు వైపులా ఆర్‌సీసీ వాల్స్‌తో సమ్మర్ స్టోరేజీ ట్యాంకును రూ.41.79 కోట్లతో నిర్మిస్తున్నామన్నారు. పట్టణంలో రూ.32 కోట్లతో సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణం పూర్తవుతుందని, ఇది పూర్తయితే భూగర్భ డ్రెయినేజీ వినియోగంలోకి వస్తుందన్నారు. మరో రూ.112 కోట్లతో టూటౌన్‌లో భూగర్భ డ్రెయినేజీ నిర్మాణానికి అనుమతులు వచ్చాయన్నారు. త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. ఇప్పటికే జగనన్న కాలనీలకు తాగునీటి సరఫరా కోసం రూ.5 కోట్లు వెచ్చించామని, ఇటీవల మరో రూ.6 కోట్ల నిధులు రాగా పైపులైన్లు వేశామని చెప్పారు.

నిత్యం ప్రజల అవసరాలు తెలుసుకుంటూ..

పట్టణంలో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధికి రూ.244 కోట్లు మంజూరు చేయించామని మంత్రి కొట్టు అన్నారు. నిత్యం ప్రజల అవసరాలు తెలుసుకుని వాటి కల్పనకు కృషిచేస్తున్నానన్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎంగా జగన్‌ని, ఎమ్మెల్యేగా తనను గెలిపించి అభివృద్ధికి ఓట్లు వేయాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ అనపర్తి శామ్యూల్, మున్సిపల్ ఇంజినీర్ మురళీకృష్ణ, ఎస్ఈపీహెచ్ సుధాకర్ (రాజమండ్రి), ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, నాయకులు ఉన్నారు.



కరకట్ట ప్రాంతంలో మంచినీటి కుళాయిలను ప్రారంభిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ



కలెక్టర్ సుమిత్‌కుమార్

- జిల్లాలో పక్కా ఏర్పాట్లు
- నేటినుంచి ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ
- 1,463కు పెరిగిన పోలింగ్ కేంద్రాలు
- 70 శాతం వెబ్ కెమెరాల ఏర్పాటు
- సార్వత్రిక ఎన్నికల ఏర్పాట్లపై 'సాక్షి'తో కలెక్టర్ సుమిత్‌కుమార్

జిల్లాలో ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ బృందాలకు ఇప్పటికే శిక్షణ పూర్తి చేశారు. ఈవీఎంల ట్రయల్‌రన్ విజయవంతంగా నిర్వహించారు. జిల్లాలో పోలింగ్ కేంద్రాలు 1,463కు పెరగ్గా ఈ మేరకు ఎన్నికల విధులు నిర్వర్తించే 10,533 మంది వివరాలు కంప్యూటరీకరణ చేశారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియ విజయవంతానికి వివిధ స్థాయిల్లో ఏర్పాట్లను నిరంతరం సమీక్షిస్తూ యంత్రాంగాన్ని ముందుకు నడిపిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూ..

– సాక్షి, భీమవరం

ఎన్నికలకు రెడీ

సాక్షి ఇంటర్వ్యూ

? జిల్లాలో ఓటర్ల సంఖ్య

జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో 14,61,337 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వీరిలో పురుషులు, 7,16,955, మహిళలు 7,44,308, ఇతరులు 74 మంది ఉన్నారు.

? పోలింగ్ కేంద్రాలు ఎన్ని

గతంలో జిల్లాలో 1,461 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 1,500కు పైగా ఓటర్లు ఉన్న ఉండి నియోజకవర్గంలోని పాలకోడేరు మండలం, భీమవరం నియోజకవర్గంలోని అర్బన్‌లో కొత్తగా ఏర్పాటుచేసిన రెండు కేంద్రాలతో మొత్తం 1,463కు పెరిగాయి.

? వెబ్ కెమెరాల ఏర్పాటు ప్రక్రియ ఎంత వరకు వచ్చింది

70 శాతం పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కెమెరాలను ఏర్పాటుచేశాం. సమస్యాత్మక కేంద్రాల్లో వీడియోగ్రఫీ చేయిస్తాం.

? సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలెన్ని..

ప్రాథమికంగా 380 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తించాం. గత ఎన్నికల సమయాల్లో జరిగిన గొడవలు, ప్రలోభాలు, మత, రాజకీయపరమైన ఘర్షణలు, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేయడం తదితర విషయాలను పరిశీలించి, ఎటువంటి హింసాత్మక ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలిచ్చాం.

? ఎన్నికల విజయవంతానికి తీసుకుంటున్న చర్యలు

సమష్టి కృషితో ఎన్నికలు విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అలాగే రాజకీయ పార్టీలు, ప్రజలు తమవంతు బాధ్యత నిర్వర్తించి సహకరించాలి.

? ఎన్నికల సిబ్బంది శిక్షణ ప్రక్రియ ఎలా సాగుతోంది

ఎన్నికల విధులపై స్టాటిక్ సర్వేలైన్స్ టీం (ఎస్ఎస్‌టీ), ఫ్లయింగ్ స్క్వాడ్ టీం (ఎఫ్ఎస్‌టీ), వీడియో వ్యూయింగ్ టీం (వీవీటీ), వీడియో సర్వేలైన్స్ టీం (వీఎస్‌టీ), సెక్టార్ ఆఫీసర్లు తదితర విభాగాలకు నెల రోజులుగా వివిధ దశల్లో శిక్షణ ఇచ్చాం. శుక్రవారం నుంచి ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం ప్రారంభమవుతుంది.



? పోలింగ్ సిబ్బంది ఎంత మంది

ఒక్కో పోలింగ్ స్టేషన్‌లో పీఓ, ఏపీఓతో పాటు సిబ్బందితో మొత్తం ఆరుగురు, అదనంగా 20 శాతం రిజర్వు సిబ్బంది ఉంటారు. మొత్తం పోలింగ్ సిబ్బంది 10,533 మందికి 10,531 మంది వివరాలను ఆన్‌లైన్ ఎంట్రీ పూర్తి చేశాం.

? నగదు, మద్యం రవాణా అడ్డుకట్టకు చర్యలేంటి

ఇప్పటికే రెవెన్యూ, పోలీస్, ఎక్సైజ్, ఫారెస్ట్, కమర్షియల్ ట్యాక్స్ శాఖలకు చెందిన అధికారుల పర్యవేక్షణలో ఆకివీడు మండలం దుంపగడప, భీమవరం రూరల్ లోసరి, తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి, యలమంచిలి మండలం చించినాడ, పెనుగొండ మండలం సిద్ధాంతం వద్ద ఐదు అంతర్ జిల్లా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నాం.

? ఈవీఎంలు ఎన్ని సిద్ధం చేశారు

ఒక్కో పోలింగ్ కేంద్రానికి రెండు ఈవీఎంలతో పాటు అదనంగా 20 శాతం ఈవీఎంలు, 30 శాతం వీవీ ప్యాట్లు సిద్ధం చేశాం. వీటికి ట్రయిల్‌రన్ విజయవంతంగా నిర్వహించారు. నోటిఫికేషన్ అనంతరం సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాల్ చేసి ర్యాండమైజేషన్ పద్ధతిలో కంప్యూటర్ సూచించిన మేరకు ఈవీఎంలను నియోజకవర్గాలకు పంపిస్తాం.

? ఐటీని ఎలా వాడుకుంటున్నారు

అక్రమాలు, ప్రలోభాలకు చెక్‌పెట్టేలా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ)ని మరింత సమర్థవంతంగా వినియోగించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పోటీలో నిలిచిన అభ్యర్థులు ర్యాలీలు, సభల నిర్వహణ నిమిత్తం అనుమతుల కోసం సువిధ యాప్‌లో దరఖాస్తు చేసుకునే విధానం, ఎన్నికల్లో ఓటర్లకు మద్యం, నగదు పంపిణీ ఇతర ప్రలోభాలు, భయభ్రాంతులకు గురిచేయడం తదితర వాటికి అడ్డుకట్ట వేసేందుకు సి-విజిల్ యాప్ వినియోగం, సిబ్బందికి ఉన్నత స్థాయి ఆదేశాలు సత్వరం చేరేందుకు అబ్జర్వర్ పోర్టల్, పోలింగ్ కేంద్రాలు, ఓటు సమాచారం ప్రజలు తెలుసుకునేందుకు పబ్లిక్ పోర్టల్ అందుబాటులో ఉంటాయి.

? ఓటరు దరఖాస్తుల పరిష్కార ప్రక్రియ గురించి..

జిల్లాలో అందిన ఫారం 6,7,8, దరఖాస్తులలో ఇప్పటివరకు 7,617 పరిష్కరించగా, మిగిలిన 3,916 దరఖాస్తులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో ఇప్పటివరకు 84,324 ఓటరు కార్డులను పోస్టల్ ద్వారా పంపిణీ చేశాం. ఇంకా 1.10 లక్షల ఓటరు కార్డులను ముద్రించాల్సి ఉంది.

? కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటుపై చర్యలేంటి

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేస్తాం. నియోజకవర్గ స్థాయిలో కంట్రోల్ రూం ఏర్పాటుకు ఆదేశాలిచ్చాం. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన వెంటనే మోడల్ కోడ్ ఆఫ్ కాంటాక్ట్ (ఎంసీసీ) అమల్లోకి వస్తుంది. కంట్రోల్ రూమ్ నుంచి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిశీలించి రిపోర్టును ఆర్ఓ ద్వారా జిల్లా ఎన్నికల అధికారికి పంపిస్తారు. సి-విజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులను 100 నిమిషాల వ్యవధిలోనే పరిశీలించి రిపోర్టును ఉన్నతాధికారులకు నివేదిస్తారు.

క్లుప్తంగా

వైఎస్సార్ టీయూసీ రాష్ట్ర కార్యదర్శిగా సత్యనారాయణ



భీమవరం : వైఎస్సార్ టీయూసీ రాష్ట్ర కమిటీలో భీమవరానికి చెందిన ఇంటి సత్యనారాయణకు చోటుదక్కింది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాలతో టీయూసీ రాష్ట్ర కమిటీ అధ్యక్షుడిగా డాక్టర్ పి గౌతమ్‌రెడ్డి నియమితులు కాగా, ఆ కమిటీలో పట్టణానికి చెందిన ఇంటి సత్యనారాయణ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, కమిటీ అధ్యక్షుడు గౌతమ్‌రెడ్డికి సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా భవాని రూప

ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం



ఏలూరు టౌన్ : రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఏలూరుకు చెందిన మోటమర్రి భవాని రూప నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయా జిల్లాల నుంచి 15 మంది డైరెక్టర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయగా ఏలూరు జిల్లా జీ సంబంధించి భవాని రూపను నియమించారు. ఏలూరు వైఎస్సార్‌సీపీ జేసీఎస్ నగర కన్వీనర్‌గా, ఏలూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి మోటమర్రి సదానంద కుమార్ పార్టీ పటిష్టానికి విశేష సేవలు అందిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షులు ఆళ్ల నాని సహకారంతో సదానందకుమార్ సతీమణి భవాని రూపను ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఏలూరుతో పాటు జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాలు, ఏలూరు పార్లమెంట్ సీటును వైఎస్సార్‌సీపీ గెలుచుకునేలా తమ వంతు కృషి చేస్తామని ఆమె తెలిపారు.

బాలికను మోసం చేసిన నిందితుడి అరెస్టు

భీమవరం : బాలికను మోసగించిన చేసిన కేసులో నిందితుడ్ని అరెస్టు చేసినట్లు భీమవరం వన్‌టౌన్ సీఐ అడబాల శ్రీను గురువారం చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వన్‌టౌన్ గునుపూడికి చెందిన 8వ తరగతి చదువుతున్న 14 ఏళ్ల బాలికను అదే ప్రాంతంలో కోడిమాంసం విక్రయించే 38 ఏళ్ల వయస్సు కలిగిన నల్లగంగుల అనిల్‌కుమార్ మాయమాటలు చెప్పి శరీరకంగా లొంగదీసుకున్నాడు. బాలిక అనారోగ్యంగా ఉండడంతో కుటుంబసభ్యులు వైద్యం కోసం ఆసుపత్రికి తీసుకువెళ్లగా పరీక్షించిన డాక్టర్ బాలిక 8 నెలల గర్భవతిగా తేల్చిచెప్పారు. దీనితో బాలికను నిలదీయగా అనిల్‌కుమార్ వ్యవహారం బయటపడడంతో బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, బాలికను వైద్యపరీక్షల కోసం ఆసుపత్రికి పంపించి నిందితుడ్ని అరెస్టు చేసినట్లు సీఐ చెప్పారు.

లక్షణంగా గోరుముద్ద

- విద్యార్థులకు పౌష్టికాహారంగా మధ్యాహ్న భోజనం
- జిల్లాలో 1,374 పాఠశాలల్లో లక్ష మందికి ఆహారం
- స్కూళ్లలో 1,440 మంది ఆయాలతో వంటకాలు
- 189 మంది నైట్ వాచ్‌మెన్స్‌తో స్కూళ్లకు భద్రత



భీమవరంలో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

భీమవరం: ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో మౌలిక వసతులు కల్పించి నాణ్యమైన విద్యను అందించడంతోపాటు పోషక విలువలతో కూడిన మధ్యాహ్న భోజన పథకం (జగనన్న గోరుముద్ద)ను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తోంది. ఏ రాష్ట్రంలోను లేని విధంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకుని 15 రకాల ఆహార పదార్థాలతో ప్రత్యేక మెనూను రూపొందించి విద్యార్థులకు పోషకాహారాన్ని అందిస్తోంది.

జిల్లాలోని 1,374 పాఠశాలల్లో..

జిల్లాలోని 1,374 పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద పథకం అమలు చేస్తుండగా మధ్యాహ్న భోజనం, పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణకు దాదాపు రూ.4.50 కోట్లకు పైగా నెలవారీగా ఖర్చు చేస్తోంది. ఈ పథకంలో సుమారు లక్ష మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుతుండగా ఆరు రోజుల పాటు రోజుకు 95 వేల గుడ్లు, 5 రోజులు చిక్కీ, వారంలో 3 రోజులు చొప్పున రాగి జావ అందిస్తుండగా, 98 శాతం మంది విద్యార్థులు వినియోగించుకుంటున్నారు. కూరగాయల అన్నం, విజిటబుల్ పలావ్, పులిహోర, హాట్ పొంగల్, స్వీట్ పొంగల్, ఆలూ కూర్మ, సాంబర్ బాత్, పప్పు ఆకుకూరలతో వినూత్న మెనూ అమలు చేస్తున్నారు. గోరుముద్ద పథకం నిర్వహణ కోసం జిల్లాలో 2,556 మంది వంట కార్మికులు పనిచేస్తుండగా వారికి నెలకు రూ.3 వేలు గౌరవ వేతనం కూడా అందిస్తున్నారు. భోజన పథకం సక్రమ నిర్వహణకు ప్రత్యేక డైరెక్టరేట్‌ను ఏర్పాటు చేసి దీని నిర్వహణకు ఐఏఎస్ అధికారిని ప్రభుత్వం నియమించింది.

రక్తహీనత నివారణకు ప్రత్యేక చర్యలు

ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 10 నుంచి 19 ఏళ్లలోపు బాలికలకు రక్త పరీక్షలు చేసి 24 వేల మంది రక్త హీనతతో ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఈ విద్యార్థినులకు ఐరన్ ఫోలిక్ సప్లిమెంటేషన్ టాబ్లెట్స్ పంపిణీ చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ యుక్త వయస్సు వచ్చిన బాలికలకు స్వేచ్ఛా కార్యక్రమం ద్వారా శానిటరీ నేప్‌కిన్స్‌ను నాలుగు నెలలకోసారి చొప్పున జిల్లాలోని 30 వేల మంది విద్యార్థినులకు నెలకు మూడు లక్షల శానిటరీ నేప్‌కిన్స్‌ను పంపిణీ చేస్తోంది.

పాఠశాలల్లో పారిశుద్ధ్యం నిర్వహణ

పాఠశాలల్లో విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉండడానికి నాడు–నేడు ద్వారా సౌకర్యవంతమైన మరుగుదొడ్లు, వాష్‌రూమ్‌లు, ఆర్‌ఓ వాటర్ ప్లాంట్స్ ఏర్పాటు చేయగా వాటి నిర్వహణకు 1,440 మంది ఆయాలను నియమించింది. వారికి ఒక్కొక్కరికీ నెలకు రూ.6 వేల గౌరవ వేతనం చొప్పున నెలకు రూ.86 లక్షలు చెల్లిస్తోంది. అలాగే హైస్కూల్స్‌కు 189 మంది నైట్ వాచ్‌మెన్లను ప్రభుత్వం నియమించి, వారికి నెలకు రూ.6 వేల చొప్పున రూ.11 లక్షల గౌరవ వేతనంగా అందిస్తోంది.

గోరుముద్ద అమలుపై ప్రత్యేక శ్రద్ధ



జగనన్న గోరుముద్ద, పాఠశాల పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని మిగిలిన జిల్లాల కంటే ముందంజలో ఉండడానికి కృషి చేస్తున్నాం. మధ్యాహ్న భోజనం, రక్తహీనత టాబ్లెట్స్ వినియోగించుకునే వారి సంఖ్యను మరింత పెంచడానికి ప్రయత్నిస్తున్నాం. జిల్లాలోని అన్ని పాఠశాలలకు నూతన వంట పాత్రలు సరఫరా చేశాం.

– ఆర్ వెంకటరమణ,
జిల్లా విద్యాశాఖాధికారి, భీమవరం



విద్యార్థినులకు రక్తహీనత నివారణ మాత్రలు అందిస్తున్న దృశ్యం (ఫైల్)

బధిరులకు ఉపాధి కల్పన దిశగా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమీత్‌కుమార్ గాంధీ

భీమవరం (ప్రకాశం చౌక్) : బధిరులకు ఉపాధి కల్పించే దిశగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో వివిధ పరిశ్రమల ప్రతినిధులు, జిల్లా పరిశ్రమల అధికారి, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి తదితర అధికారులతో బధిరులకు ఉపాధి కల్పించే అంశంపై కలెక్టర్ సమీక్షించారు. వారి విద్యార్హతలు, నైపుణ్యం పరిగణనలో తీసుకుని జిల్లాలోని వివిధ పరిశ్రమల్లో మూడు నెలలపాటు శిక్షణ అందించి, తద్వారా ఆయా రంగాలలో ఉపాధిని కల్పిస్తామన్నారు. స్వయం ఉపాధికి అవసరమైన రుణ సదుపాయాన్ని పీఎంఈజీపీ, ముద్ర స్కీం, తదితర కేంద్ర, రాష్ట్ర పథకాల ద్వారా అందజేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా పరిశ్రమల ప్రతినిధుల అభిప్రాయాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతిరావు, కలెక్టరేట్ ఏఓ పి.పాపారావు, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ ఎ.నాగేంద్ర ప్రసాద్, పీసీబీ ఏఈ ఎస్.రమేష్, ఎస్‌బీఐ డీబీఐ రిప్రజెంటేటివ్ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్, వివిధ పరిశ్రమల ప్రతినిధులు, బధిరులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భీమవరం జనసేన సభలో ఉద్రిక్తత

- వీరవాసరం నాయకుడిపై చినబాబు వర్గం మండిపాటు
- చుట్టుముట్టి దాడికి సిద్ధం కావడంతో కంగుతిన్న కార్యకర్తలు
- పార్టీలో గ్రూపు రాజకీయాలపై ఎన్నికల్లో పరిస్థితిపై ఆందోళన

భీమవరం : జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం భీమవరంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. భీమవరం జనసేన పార్టీ అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ఆధ్వర్యంలో ఒక కల్యాణ మండపంలో పార్టీ ఆవిర్భావ వేడుక, అంజిబాబు పరిచయ కార్యక్రమం ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని వీరవాసరం, భీమవరం మండలాలతో పాటు, భీమవరం పట్టణానికి చెందిన జనసేన నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. మొన్నటివరకు జనసేన పార్టీకి సంబంధం లేని అంజిబాబుకు పార్టీ టికెట్ ఇవ్వడంతో ఎప్పటి నుంచో పార్టీ కోసం పనిచేస్తున్న కొంతమంది నాయకులు, కార్తకర్తలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. అంజిబాబుకు టికెట్ ఇవ్వద్దంటూ పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. దీంతో వారిని బుజ్జగించడానికి కార్యక్రమం ఏర్పాటు చేయగా దానికి పరిచయ కార్యక్రమమంటూ ప్రచారం చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు (చినబాబు), పార్టీ పీఏసీ సభ్యుడు వేగేశ్న కనకరాజు సూరి, వీరవాసరం జెడ్పీటీసీ గుండా జయప్రకాష్‌నాయుడు, చెనమల్ల చంద్రశేఖర్ తదితరులు పార్టీ నాయకులు, కార్యకర్తలను పరిచయం చేశారు. ఇదే సమయంలో వీరవాసరం మండలానికి చెందిన ఒక నాయకుడు వేదిక వద్దకు వస్తున్న సమయంలో చినబాబుపై విమర్శలు చేసిన వాడివి ఇక్కడికి ఎందుకు వచ్చావంటూ పెద్ద సంఖ్యలో చుట్టుముట్టి దాడికి సిద్ధమయ్యారు. దీంతో ఒక్కసారిగా అక్కడ ఉద్రిక్తత నెలకొంది. మిగిలిన వారికి అక్కడ ఏం జరుగుతుందో అర్థంగాక మహిళలు, కార్యకర్తలు భయభ్రాంతులకు గురయ్యారు. దీంతో కొంతమంది జోక్యం చేసుకుని వివాదం ముదరకుండా సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో సదరు నాయకుడు అక్కడి నుంచి బయటికి వెళ్లిపోవడం గమనార్హం. మొత్తం మీద జనసేన పార్టీలో నివురుగప్పిన నిప్పులా ఉన్న గ్రూపు రాజకీయాలు బయటపడుతుండడంతో ఎన్నికల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన వ్యక్తమవుతోంది.

సరికొత్త సాంకేతిక పరిజ్ఞానం అవసరం

ఏఆర్‌కే ఇన్ఫోసొల్యూషన్ కంట్రీ మేనేజర్ విశ్వేశ్వరన్



తాడేపల్లిగూడెం: అద్భుత ప్రపంచాలు సృష్టించాలంటే సరికొత్త సాంకేతికత అవసరమని ఏఆర్‌కే ఇన్ఫోసొల్యూషన్స్ కంట్రీ మేనేజర్ విశ్వేశ్వరన్ అన్నారు. ఏపీ నిట్‌లో గురువారం ఆగ్‌మెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీ, మిక్స్‌డ్ రియాలిటీ సాంకేతికతలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం జరిగింది. వర్చువల్ రియాలిటీ సాంకేతికతను వినియోగిస్తున్నప్పుడు ఓ సరికొత్త అద్భుత ప్రపంచంలోకి అడుగుపెట్టిన అనుభూతి కలుగుతుందన్నారు. టెక్నాలజీ వర్చువల్‌లో లీనమయ్యే అనుభవాలతో కూడిన డిజిటల్ కంటెంట్‌ను సృష్టించడం కోసం ఉపయోగిస్తారన్నారు. 2030 నాటికి ప్రపంచంలోని పరిశ్రమల్లో 5.0 లక్ష్యాలను అందుకోడానికి సరికొత్త సాంకేతికతలు దోహదపడుతున్నాయన్నారు. లేనిదానిని ఉన్నట్టు వాస్తవానికి దగ్గరగా మన కళ్లకు చూపించడమే ఈ టెక్నాలజీ ప్రత్యేకత అన్నారు. దీనిని ఒక్క గేమింగ్‌లోనే కాకుండా మాన్యుఫ్యాక్చరింగ్, కన్‌స్ట్రక్షన్, మెడికల్, ఆటోమొబైల్, రోబోటిక్స్, రక్షణ విభాగం వంటి ఎన్నో రంగాల్లో విరివిగా వినియోగిస్తున్నారన్నారు. ఈ వర్చువల్ సాంకేతికతలపై పట్టు సాధించిన విద్యార్థుల కొలువలకు కొదవ ఉండదన్నారు. సీఎస్‌ఈ విభాగాధిపతి కె.హిమబిందు, డాక్టర్ కార్తీక్ శేషాద్రి, వి.సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఉపాధ్యాయుల సస్పెన్షన్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విధులకు సక్రమంగా హాజరు కాకపోవడం, విద్యార్థినులను దండించడం వంటి కారణాలతో జిల్లాలో ఇద్దరు ఉపాధ్యాయులను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జంగారెడ్డిగూడెం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (హిందీ)గా పనిచేస్తున్న ఎస్.గోవిందరావు విద్యార్థినులను దండించిన కారణంగా విధుల నుంచి సస్పెండ్ చేశామన్నారు. అలాగే గణపవరం మండలం పిప్పర జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (పీఈ)గా పనిచేస్తున్న ఆర్.సీతారాం పాఠశాల విధులు సక్రమంగా నిర్వహించకపోవడం, బాలికలను దండించడం వంటి కారణాలతో సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

మద్దిపాటికి అసమ్మతి సెగ

ద్వారకాతిరుమల: గోపాలపురం టీడీపీ టికెట్‌ను మద్దిపాటి వెంకటరాజుకు ఖరారు చేస్తూ అధిష్టానం గురువారం ప్రకటించడంతో ఆ పార్టీకే చెందిన మద్దిపాటి వ్యతిరేక వర్గం విస్మయానికి గురైంది. గోపాలపురం టికెట్‌ను మద్దిపాటి వెంకటరాజుకు ఇవ్వవద్దని, దీని వల్ల ఇక్కడ ఓడిపోతామని సొంతపార్టీకి చెందిన ఓ ముఖ్యనేత వర్గం పార్టీ అధినేత దృష్టికి పలుసార్లు తీసుకువెళ్లారు. మద్దిపాటికి తప్ప ఎవరికి టికెట్ ఇచ్చినా పర్వాలేదంటూ చెప్పారు. ఇటీవల 500కిపైగా కార్లతో మంగళగిరిలోని టీడీపీ ప్రధాన కార్యాలయానికి సైతం ర్యాలీగా వెళ్లి ఆందోళనలు కూడా చేశారు. దీంతో ఈ విషయాన్ని పరిశీలిస్తామని ఆ పార్టీ ముఖ్య నేతలు చెప్పడంతో ఇక మద్దిపాటికి టికెట్ రాదని ధీమాగా ఉన్నారు. ఈ నేపథ్యంలో గురువారం గోపాలపురం టికెట్‌ను మద్దిపాటికి ప్రకటించడంతో వ్యతిరేక వర్గం నేతలు జీర్ణించుకోలేని పరిస్థితి ఏర్పడింది. తమ సూచనలను పార్టీ అధిష్టానం కనీసం పరిగణలోకి తీసుకోలేదని కొందరు నేతలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. ఎన్నికల్లో మద్దిపాటి అనుకూలంగా పనిచేసేది లేదని బహిరంగంగా చెబుతున్నారు. మద్దిపాటికి టికెట్ ఇవ్వడం వల్ల ప్రత్యర్థి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి తానేటి వనిత గెలుపు నల్లేరుపై నడకేనని టీడీపీ అసమ్మతి నేతలు వాపోతున్నారు. ఎన్నోసార్లు టికెట్ ఇవ్వొద్దని మొత్తుకున్నా పార్టీ అధిష్టానం అసమ్మతి వర్గాన్ని లెక్క చేయకుండా మద్దిపాటి పేరు ప్రకటించడంతో వారు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. దీంతో మద్దిపాటిని ఎలాగైనా ఓడించాలని వ్యతిరేక వర్గ నాయకులు పట్టుదలగా ఉన్నట్టు తెలుస్తోంది.

రాష్ట్రంలో విద్యకు అధిక ప్రాధాన్యత

- చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు
- పీఎం లంక హైస్కూల్‌లో, పలు అభివృద్ధి పనుల ప్రారంభం



పీఎం లంక హైస్కూల్‌లో నాడు-నేడు పనులను ప్రారంభించిన చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్ : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. నరసాపురం మండలంలోని పెదమైనవానిలంకలో నాడు–నేడు రెండో విడత నిధులు రూ.1.20 కోట్లతో నిర్మించిన జెడ్పీ హైస్కూల్ అదనపు తరగతి గదులు, రూ.30 లక్షల ఉపాధి హామీ నిధులతో నిర్మించిన పలు సిమెంట్ రహదారులను ప్రారంభించారు. అలాగే రూ.30 లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రహదారి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పెదమైనవానిలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద జరిగిన సభలో ప్రసాదరాజు మాట్లాడుతూ గ్రామంలో పూర్వం నుంచి ఉన్న హైస్కూల్, ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు అన్ని మౌలిక సదుపాయాలతో సుందరంగా పాఠశాలలను నిర్మించడం జరిగిందన్నారు. విద్యకోసం ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తోందన్నారు. విద్యార్థులు మధ్యలో బడి మానకుండా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. అమ్మ ఒడి, విద్యాదీవెన, విద్యాకానుక, వసతి దీవెన వంటి పథకాలు అమలు చేస్తూ పేద విద్యార్థులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. పెదమైనవానిలంక హైస్కూల్‌లో ప్రహరీ నిర్మించి, అన్ని మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా నరసాపురం నియోజకవర్గంలో ఐదు జూనియర్ కాలేజీలు, ఆక్వా యూనివర్సిటీలను సీఎం వైఎస్ జగన్ సహకారంతో మంజూరు చేయించుకున్నామన్నారు. గ్రామంలో రూ.9 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేశామన్నారు. ఓవర్‌హెడ్ ట్యాంకు, పైపులైన్ నిర్మాణాలకు నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేశామన్నారు. గ్రామంలోని అర్హులైన వారందరికీ ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలను అందిస్తున్నామని చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు చెప్పారు. రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ తిరుమాని నాగరాజు, జెడ్పీటీసీ సభ్యులు బొక్కా రాధాకృష్ణ, వైస్ ఎంపీపీ ఉంగరాల రమేష్ నాయుడు, జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షులు అంద్రాజు చల్లారావు, గ్రామ సర్పంచ్ కొల్లాటి కనకదుర్గ, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు దొంగ మురళీకృష్ణ, ఎంపీటీసీ సభ్యులు తిరుమాని దుర్గ, తాతారావు, ఒడుగు జనార్ధనరావు, చినమిల్లి చందు, తిరుమాని రామకృష్ణంరాజు, తిరుమాని కాంతారావు, ఒడుగు శ్రీను, ఒడుగు శ్రీను, ఒడుగు వీరవెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

గీతాంజలి మృతికి కారకులను కఠినంగా శిక్షించాలి

- టీడీపీ, జనసేన సోషల్ మీడియా వేధింపుల వల్లే ఆత్మహత్య
- పార్లమెంట్ అభ్యర్థి ఉమాబాల, పాలకొల్లు ఇన్‌చార్జి గుడాల గోపి
- వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పాలకొల్లులో కొవ్వొత్తుల ర్యాలీ



పాలకొల్లులో కొవ్వొత్తుల ప్రదర్శనతో గీతాంజలికి నివాళులర్పిస్తున్న గూడూరి ఉమాబాల, గుడాల గోపి

పాలకొల్లు అర్బన్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో తనకు ఇంటిస్థలం పట్టా వచ్చిందని మీడియా ముందు తన ఆనందాన్ని వెలిబుచ్చిన తెనాలి పట్టణానికి చెందిన విశ్వబ్రాహ్మణ మహిళ గీతాంజలి మరణానికి కారకులైన టీడీపీ, జనసేన సోషల్ మీడియా సభ్యులను తక్షణం అరెస్ట్ చేసి చట్టపరంగా శిక్షించాలని వైఎస్సార్ సీపీ పార్లమెంట్ అభ్యర్థి గూడూరి ఉమాబాల, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) డిమాండ్ చేశారు. పాలకొల్లులోని గాంధీబొమ్మల సెంటర్‌లో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు. గీతాంజలి జోహార్, టీడీపీ, జనసేన సోషల్ మీడియా నశించాలని నినాదాలు చేశారు. పార్లమెంట్ అభ్యర్థి గూడూరి ఉమాబాల మాట్లాడుతూ మహిళలకు అన్నిరంగాల్లోనూ ప్రాధాన్యత ఇస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను చూసి తెలుగుదేశం, జనసేన పార్టీలు ఓర్వలేకపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలు పొందిన గీతాంజలిని సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోల్ చేసి ఆమెను మానసికంగా వేధించారని దుయ్యబట్టారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) మాట్లాడుతూ గీతాంజలి మృతికి కారకులైన దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. అత్యాచారం దోషులకు విధిస్తున్న శిక్షను టీడీపీ, జనసేవ సోషల్ మీడియా సభ్యులకు విధించి బహిరంగంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ వనుం సత్యకల్యాణి, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి మద్దా చంద్రకళ, సహాయ కార్యదర్శి కర్రా జయసరిత, ఎంపీటీసీ సభ్యులు డేగల సూర్యప్రభ, పార్టీకి చెందిన మహిళలు కడలి రామలక్ష్మి, కాండ్రేకుల రాజేశ్వరి, బొండపల్లి గిరిజ, శిడగం రమణ, కాసా విజయ భవాని, పైలా వరలక్ష్మి, పైలా రాజశ్రీ, మాముడూరి నాగమణి, బద్దా ఇందిర, పెచ్చెట్టి లక్ష్మీ విమల, పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు, మండల కన్వీనర్ విప్పర్తి ప్రభాకరరావు, జేసీఎస్ జిల్లా అధికార ప్రతినిధి ఖండవల్లి వాసు, కుంచిలపల్లి వినిస్టన్‌బాబు, ఉచ్చుల స్టాలిన్, మానుకొండ శ్రీనుబాబు, గుమ్మాపు సూర్యవరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు



పెదమల్లంలో ఎమ్మెల్యే రంగనాథరాజు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ, జనసేన నాయకులు

పెనుగొండ: ఆచంట మండలం పెదమల్లంలో టీడీపీ, జనసేనలకు చెందిన నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో ఆచంట ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. గురువారం రాత్రి పెదమల్లంలో ఎన్నికల శంఖారావంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్‌కు అండగా ఉండాలని ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు కోరారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ జెండా స్తూపం ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ అమలు చేస్తున్న సంక్షేమం, నియోజకవర్గంలో శ్రీరంగనాథరాజు చేపట్టిన అభివృద్ధికి ఆకర్షితులైన గ్రామానికి చెందిన బోడపాటి సూరిబాబు, దివి రాంబాబు, దాసిరెడ్డి అన్నవరం, ఆదిమూలం ఆదినారాయణ, దిరిసాల సాయి, దుర్గారావు, దిరిసాల ఆదిబాబు, గంధం వెంకట రత్నం, దిరిసాల తాతయ్య, నాగిరెడ్డి రాజు, గణేషుల నూకయ్య, ఆదిమూలం చిన సత్యనారాయణ, నాగిరెడ్డి, బ్రహ్మారావులతో పాటు పలువురు పార్టీలో చేరడంతో వారికి శ్రీరంగనాథరాజు వైఎస్సార్ సీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సర్పంచ్ దిరిశాల విజయలక్ష్మి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

లయన్స్ సేవలు అభినందనీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో లయన్స్ క్లబ్ సేవలు మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు. వరల్డ్ కిడ్నీ డే పురస్కరించుకుని లయన్స్‌క్లబ్ స్పిరిట్ ఆధ్వర్యంలో స్థానిక ఏరియా ఆస్పత్రిలో గురువారం డయాలసిస్ సెంటర్ వద్ద జిల్లా క్యాబినెట్ సెక్రటరీ నూకల నాగ మల్లేశ్వరరావు అధ్యక్షతన డయాలిసిస్ బాధితులకు పండ్లు పంపిణీ చేశారు. కిడ్నీ బాధతులకు సేవలు అందిస్తున్న సిబ్బందికి నూతన వస్త్రాలు బహుకరించారు. ఇంచార్జిలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, లయన్ పదం కుమార్ గుప్తా, పేరిచర్ల మురళీకృష్ణంరాజు, బత్తుల ప్రసాద్, రంజిత్, సత్యనారాయణ తదితరులు హాజరైయారు. తొలుత ధన్వంతరి, భారతమాత విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లలర్పించారు.

ఎల్ఐసీలో క్యాన్సర్‌పై అవగాహన

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక జీవిత బీమా సంస్థలో గురువారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వ్యాపార పోటీ విజేతలను సత్కరించారు. బహుమతులు అందజేశారు. డాక్టర్ శోభారాణి హాజరై మాట్లాడుతూ మహిళలు ఎదుర్కొనే రొమ్ము క్యాన్సర్, సర్వికల్ క్యాన్సర్‌లపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ ఎస్ఎస్ శ్రీరామ్, అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ వైవీ రావు, గణపవరం బ్రాంచ్ మేనేజర్ ఎస్.రేఖ వాణి, ఉద్యోగులు సాలన సత్యనారాయణ, గంగాధర్, విద్యా సాగర్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

తణుకు అర్బన్: ఈనెల 16వ తేదీన తణుకు కోర్టులో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో అధిక శాతం కేసులు పరిష్కరించేందుకు పోలీసు అధికారులు కృషి చేయాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి అన్నారు. తణుకు కోర్టులో గురువారం పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ రాజీకాదగ్గ క్రిమినల్, సివిల్, మోటారు వాహన ప్రమాద కేసులు పరిష్కరించుకోవచ్చని అన్నారు. కక్షిదారులు ఈ సదవకాశాన్ని సద్వినియోగపరచుకుని తమ విలువైన సమయాన్ని, డబ్బును ఆదాచేసుకునే విధంగా వారిని సిద్ధం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో తణుకు కోర్టు పరిధిలోని పోలీసు అధికారులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలి

తాడేపల్లిగూడెం అర్బన్: రైతులు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలని వైఎస్సార్ ఉద్యానవర్సిటీ శాస్త్రవేత్తలు సూచించారు. వైఎస్సార్ ఉద్యాన వర్సిటీలో రైతు - శాస్త్రవేత్తల ముఖాముఖి కార్యక్రమాన్ని గురువారం వ్యవసాయ విస్తరణాధికారి డాక్టర్ ఇ కరుశ్రీ అధ్యక్షతన నిర్వహించారు. కేవికె శాస్త్రవేత్తలు మాట్లాడుతూ ఉద్యాన విభాగంలో సాంకేతిక పరిజ్ఞానం, సేంద్రియ, సహజ వ్యవసాయ పద్ధతులు, సమీకృత యాజమాన్యం విధానాలు, కోళ్ళు, చేపల పెంపకం తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో కేవికే శాస్త్రవేత్తలు విస్తరాణాధికారి డాక్టర్ వి.దీప్తి, మత్స్యవిభాగం డాక్టర్ దేవివరప్రసాద్ రెడ్డి, మృత్తిక విభాగం, డాక్టర్ ఎం రాఘవేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తణుకులో ల్యాబ్ టెక్నీషియన్ల దినోత్సవం

తణుకు: మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ దినోత్సవాన్ని తణుకు ప్రైవేటు మెడికల్ ల్యాబ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తణుకు పట్టణానికి చెందిన సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్లు గుప్తా, చక్రవర్తి, గోపి, పూర్ణచంద్రరావు, సూర్య, సుబ్రహ్మణ్యం, వెంకట్, రాయుడులను ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కేకు కట్ చేసి వేడుకలు చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు వినయ్, జయకృష్ణ, కార్యదర్శి శ్రీను, కోశాధికారి గుప్తా, రవి, సింహాద్రి, ఆనంద్, తరుణ్ పాల్గొన్నారు.

ఏకాగ్రతతోనే విజయాలు సాధ్యం

తాడేపల్లిగూడెం రూరల్: విద్యార్థులు ఏకాగ్రతతో పాఠ్యాంశాలు చదవడం ద్వారా విజయం సాధ్యమని ఎంఈవో-2 పీఎం కే.జ్యోతి అన్నారు. గురువారం మండలంలోని పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సభకు ప్రిన్సిపల్ బి.రాజారావు అధ్యక్షత వహించారు. ఎంఈవో జ్యోతి మాట్లాడుతూ విద్యతో పాటు మానసిక ప్రశాంతతకు క్రీడలు ఉపకరిస్తాయని, రోజులో కొంత సమయాన్ని క్రీడలకు కేటాయించాలన్నారు. తద్వారా జ్ఞాపకశక్తి, ఏకాగ్రత అలవడుతుందన్నారు. ప్రిన్సిపల్ బి.రాజారావు మాట్లాడుతూ పదో తరగతి ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో నిలిచి రికార్డు సాధిస్తామన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అనంతరం ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శిగొలిమే బుజ్జిబాబు, పలువురు ఉపాధ్యాయులను దుశ్శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సత్యనారాయణ, ఉపాధ్యాయులు లంకా రాజు, విజయరాజు, వెంకటేశ్వరరావు, స్కూలు పేరెంట్స్ కమిటి చైర్మన్ కత్తుల రవిజైన్, ప్రెస్ క్లబ్ సహాయ కార్యదర్శి కొత్తపల్లి గోపీచంద్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి అండగా 'చేయూత'



తణుకులో వైఎస్సార్ చేయూత కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి (ఫైల్)



తణుకులో వైఎస్సార్ చేయూత కార్యక్రమానికి హాజరైన లబ్ధిదారులు.(ఫైల్)

- హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్న మహిళలు
- నియోజకవర్గంలో రూ. 92.34 కోట్ల లబ్ధి

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల్లో భాగంగా ప్రతిష్టాత్మకంగా అందించిన వైఎస్సార్ చేయూతతో మహిళలు ఆర్థికంగా బలోపేతం అవుతున్నారు. 45 నుంచి 60 సంవత్సరాల్లోపు వయసున్న అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ మహిళలందరికీ వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఏడాదికి రూ.18,750లు చొప్పున 4 విడతల్లో రూ. 75 వేలు ఇప్పటికే అందజేశారు. దీంతో మహిళలు చిరు వ్యాపారాలు నిర్వహించుకుంటూ ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేద, బడుగు బలహీనవర్గాలంతా అభివృద్ధి బాట పడుతున్నామని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 7వ తేదీన బటన్ ప్రెస్ చేసి వైఎస్సార్ చేయూత నిధులు విడుదల చేయగా లబ్ధిదారులకు బ్యాంకు ఖాతాలకు నేరుగా జమయ్యాయి. జగనన్న మహిళా పక్షపాతి అంటూ వేనోళ్ల పొగుడుతున్నారు.

తణుకు నియోజకవర్గంలో రూ. 92.34 కోట్లు..

తణుకు నియోజకవర్గంలోని తణుకు మున్సిపాల్టీ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాకు సంబంధించి వైఎస్సార్ చేయూత నాలుగు విడతల్లో 12312 మంది లబ్ధిదారులకు రూ. 92.34 కోట్లు అందజేశారు. ఇచ్చిన మాట ప్రకారం నాలుగు విడతల్లో లబ్ధి పంపిణీ చేయడంతో లబ్ధిదారులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్ చేయూత లబ్ధి నాలుగు విడతల్లో ఇలా..

	లబ్ధిదారులు	నగదు
తణుకు మున్సిపాల్టీ	3180	రూ.23.85 కోట్లు
తణుకు	2665	రూ.19.98 కోట్లు
అత్తిలి	3360	రూ.25.20 కోట్లు
ఇరగవరం	3107	రూ.23.30 కోట్లు

మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూత



వైఎస్సార్ చేయూత పథకం ద్వారా మహిళలను ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగు విడతల్లో అందించిన రూ. 75వేలు లబ్ధితో కొందరు మహిళలు చిరు వ్యాపారాలు నిర్వహించుకుంటుండగా మరి కొందరు వారి అవసరాలు తీర్చుకున్నారు.

– నూకల కనకదుర్గ, వైఎస్సార్‌సీపీ తణుకు పట్టణ మహిళాధ్యక్షురాలు

వైఎస్సార్ చేయూత ఆదుకుంది



వైఎస్సార్ చేయూత ద్వారా నాలుగు విడతల్లో అందించిన రూ. 75వేలు నాకు చాలా ఉపయోగపడింది. బడుగు, బలహీన వర్గాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచి ఆర్థిక స్థితిగతులను మార్చారు. ప్రభుత్వ పనితీరుపట్ల చాలా సంతోషంగా ఉంది.

– పత్తిపాటి శిలువమ్మ, వైఎస్సార్ చేయూత లబ్ధిదారు. ఉనికిలి

అన్ని పథకాలనూ అమలు చేశారు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం అన్ని పథకాలు సంపూర్ణంగా అమలు చేశారు. ముఖ్యంగా వైఎస్సార్ చేయూత ద్వారా పేదవర్గాల మహిళలకు అండగా నిలబడ్డారు. నాలుగు విడతల్లో నాకు రూ. 75వేలు బ్యాంకు ఖాతాల్లో పడింది. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇలా చేయలేదు.

– కె.బంగారమ్మ, వైఎస్సార్ చేయూత లబ్ధిదారు, పైడిపర్రు

చిరుధాన్యాలతో ఆరోగ్యం



పోషక విలువలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తణుకు టౌన్: చిరుధాన్యాలు తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ వెంకట లక్ష్మి తెలిపారు. పోషకాహార పక్షోత్సవాల్లో భాగంగా గురువారం తణుకు రూరల మండలంలోని పలు గ్రామాల్లో పోషకాహారం పంపిణీపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ వెంకట లక్ష్మి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

అత్తిలి: మండలంలోని కేఎస్ గట్టు అంగన్‌వాడీ సెంటర్‌లో పోషణ పక్షోత్సవాల్లో కార్యక్రమంలో భాగంగా గురువారం ఆహారంలో వైవిధ్యత అంశంపై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్టార్ సూపర్‌వైజర్ కె.కుమారి మాట్లాడుతూ గర్భం దాల్చిన రోజు నుంచి పోషకాలు అధికంగా ఉండే ఆకుకూరలు, కూరగాయలు ఆహారంలో తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఆకుకూరల వలన హిమోగ్లోబిన్ శాతం పెరుగుతుందని, కంటికి రేచీకటి వంటి వ్యాధులు రాకుండా కాపాడుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ దీపికా రాణి, పూర్ణ గిరి నవోమి, అంగన్‌వాడీ కార్యకర్తలు, పాల్గొన్నారు.

సంక్షేమాభివృద్ధికి జగన్ పెద్దపీట

- ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- రూ.74.50 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



2వ సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్దపీట వేశారని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. తాడేపల్లిగూడెంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ గురువారం భూమి పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు మాట్లడుతూ పట్టణంలోని 12వ వార్డులో 74.50 లక్షలతో రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తున్నామన్నారు. అదేవిధంగా కరకట్ట ప్రాంతవాసులు ఎన్నోఏళ్లుగా కలకంటున్న తాగునీటి సరఫరా కల సాకారమైందన్నారు. కరకట్ట ప్రాంతానికి మంచినీటి పైపులను ఏర్పాటు చేసి ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ ప్రాంతంలో కుళాయిలు లేని వారికి 200 రూపాయల స్కీములో కుళాయిలను ప్రతి ఇంటికి ఏర్పాటు చేయాలని అధికారులకు సూచనలు చేశారు. అనంతరం అక్కడి నుంచి కుంచనపల్లి శివారు కడియపు చెరువు వద్ద ఏర్పాటు చేస్తున్న రెండవ సమ్మర్ స్టోరేజి ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు మాట్లాడుతూ తాను మొదటిసారి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పట్టణం విస్తరిస్తోందని గ్రహించి 2వ సమ్మర్ స్టోరేజి ట్యాంకు నిర్మాణానికి గతంలో రూ.31 కోట్లతో ప్రణాళిక సిద్ధం చేశారన్నారు. అనంతరం మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో వచ్చిన నాయకులు ఈ నిర్మాణానికి ముందుకు సాగనివ్వలేదన్నారు. తాను 2వ సారి ఎమ్మెల్యేగా గెలిచి ఉప ముఖ్యమంత్రిగా, దేవదాయ శాఖ మంత్రిగా పట్టణాన్ని, నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ముందుకు సాగుతున్నామన్నారు.

జగన్న కాలనీలకు రూ.5 కోట్లతో మంచినీటి సరఫరా

జగనన్న కాలనీలకు మంచినీటి సరఫరా చేసేందుకు రూ.5కోట్లు వెచ్చించామని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ వెల్లడించారు. మళ్లీ ఇటీవల కాలంలో మరో రూ.6కోట్లు మొత్తం రూ.11 కోట్లుతో మంచినీటి పైపులైన్లు వేశామని చెప్పారు. నేడు జగనన్న కాలనీల్లో మంచినీటిని అందిచేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి కొట్టు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ అనపర్తి శామ్యూల్, మున్సిపల్ ఇంజినీరు మురళీకృష్ణ, ఎస్ఈపీహెచ్ సుధాకర్ (రాజమండ్రి) ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్, నాయకులు కర్రి భాస్కరరావు, చెన్నా జనార్దన, బొద్దాని శ్రీనివాస్, అడ్డాల నర్సింహరావు, దస్తగిరి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

తాడేపల్లిగూడెం అర్బన్: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా స్వీప్ నోడల్ అధికారి ప్రభాకర్ పిలుపునిచ్చారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ఓటుహక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం నుంచి రెవెన్యూ డివిజినల్ కార్యాలయం వరకు గురువారం ర్యాలీ నిర్వహించారు. యువత, మహిళలు ఓటు హక్కును నిజాయితీగా వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

పెంటపాడు: ఎన్నికలు సజావుగా సాగేందుకు రాజకీయ పార్టీల నాయకులు, సిబ్బంది సహకారం ఎంతో అవసరమని తహసీల్దార్ రమేష్‌బాబు, ఎస్ఐ మోహనరావులు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం పెంటపాడు మండల సమావేశ మందిరంలో ఎన్నికల కోడ్‌పై పలు రాజకీయ పార్టీల నాయకులు, సిబ్బందికి అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్, ఎస్సైలు మాట్లాడుతూ ప్రభుత్వం కోడ్ విధించిన వెంటనే రాజకీయ పార్టీలు నిబంధనలు అనుసరించి నడుచుకోవాలన్నారు. ఓటర్లను ప్రలోభాలు పెట్టే ఎటువంటి సంఘటనలైనా తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాలాజీ, ఆయా గ్రామాల కార్యదర్శులు, వీఆర్వోలు, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

హస్త కళాకారులకు ప్రోత్సాహం



తణుకులో లబ్ధిదారుకు కుట్టుమిషన్, సామగ్రి పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

తణుకు అర్బన్: హస్త కళాకారులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యతనిస్తూ వారికి ఉపాధి కల్పిస్తున్నారని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ అన్నారు. తణుకు శ్రీబాలగంగాధర తిలక్ ఆడిటోరియంలో గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ (ఏపీహెచ్‌డీసీ) ఆధ్వర్యంలో ఎస్సీ మహిళా కళాకారులకు ఉచిత కుట్టు మిషన్లు, ఎంబ్రాయిడరీ సామాగ్రి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ మాట్లాడుతూ హస్తకళలకు సంబంధించి ఎంబ్రాయిడరీ అంశంలో మహిళలకు అధికశాతం ఉపాధి పొందే అవకాశం ఉందన్నారు. చేతి కళలకు విదేశాల్లో సైతం మంచి ప్రోత్సాహం ఉందని, లేపాక్షి ఎంపోరియంల ద్వారా అత్యధికంగా విక్రయాలు జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న కుట్టు శిక్షణ, అనంతరం ఉచితంగా కుట్టుమిషన్స్, సామాగ్రి పంపిణీని సద్వినియోగం చేసుకుని నైపుణ్యాన్ని మెరుగుపరచుకోవాలని కోరారు. ఏపీహెచ్‌డీసీ చైర్‌పర్సన్ బడిగించల విజయలక్ష్మి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా 20 లేపాక్షి ఎంపోరియలు నడుస్తున్నాయని, వీటి ద్వారా హస్తకళాకారులు తయారు చేసిన వివిధ రకాల వస్తువులను విక్రయాలు జరుగుతున్నాయని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హస్తకళాకారుల సంక్షేమం కోసం కార్పొరేషన్ ద్వారా అత్యధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారని అన్నారు. తణుకు పట్టణంలో 32 మంది ఎస్సీ మహిళలకు రెండు నెలలపాటు శిక్షణనిచ్చి నేడు ఉచితంగా కుట్టు మిషన్లు అందచేసినట్లు చెప్పారు. ఏపీఎచ్‌డీసీ ఈడీ ఎంవిశ్వ, డీసీహెచ్ హెచ్‌పీ సువర్చల, కాకినాడ లేపాక్షి ఎంపోరియం మేనేజర్ వీరబాబు, రాజమహేంద్రవరం లేపాక్షి ఎంపోరియం మేనేజర్ మౌనిక ఉన్నారు.

అప్రమత్తతే ఆరోగ్య మంత్రం



తణుకులో డయాలసిస్ యూనిట్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రవీంద్రనాథ్, డాక్టర్ అరుణ తదితరులు

తణుకు అర్బన్: మానవ శరీర అవయవాల్లో కిడ్నీపాత్ర అత్యంత కీలకమని ఎమ్మెల్సీ, లయన్స్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ వంక రవీంద్రనాథ్ అన్నారు. ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా గురువారం తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో వంక సత్యనారాయణ, నాగమణి రీనల్ డయాలసిస్ యూనిట్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్ మాట్లాడుతూ కొన్ని రకాల ఆహార అలవాట్లు, తాగునీరు సక్రమంగా తీసుకోకపోవడం వంటి కారణాలతో కిడ్నీ సమస్యలు అధికమవుతున్నాయని స్పష్టం చేశారు. ధూమపాన అలవాట్లు, మానసిక ఒత్తిడి కారణాలతో సైతం కిడ్నీలు పనిచేసే తీరు గాడి తప్పుతుందని అన్నారు. ముఖ్యంగా సుగర్, బీపీ వంటి రుగ్మతలు ఉన్న వారు వైద్యుల సలహాల మేరకు క్రమం తప్పకుండా క్రియాటిన్ తదితర పరీక్షలు తరచూ చేసుకోవాలని సూచించారు. ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెలగల అరుణ మాట్లాడుతూ ప్రస్తుతం 10 మిషన్లతో సేవలందిస్తున్న ఈ యూనిట్‌కు రానున్న రోజుల్లో మరొక 5 మిషన్లు అందుబాటులోకి వస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎండోక్రైనాలజీ వైద్య నిపుణులు డాక్టర్ రాజేష్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు మాదిరెడ్డి బాబూజీరావు, డి.రంగారావు, డయాలసిస్ ఇన్‌చార్జ్ శ్రీనివాసరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయ నిర్మాణానికి వితరణ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కుంచనపల్లి గ్రామంలో నిర్మిస్తున్న కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయానికి తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన పదమ్ కుమార్‌గుప్తా రూ.58,116లను గురువారం విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని ఆలయ ట్రస్ట్, కమిటీ సభ్యులకు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయనను ఆలయ ట్రస్ట్, కమిటి సభ్యులు అభినందించారు.

కేంద్రం హామీలను అమలు చేయాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): రైతుల చలో ఢిల్లీ సందర్భంగా కేంద్రం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ గురువారం సీఐటీయు ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. 60 ఏళ్లు నిండిన రైతులకు పెన్షన్ రూ.6 వేలు అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన



వల్లూరుపల్లి- రాచర్ల రోడ్డుకు శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: ఐదేళ్ల ప్రజారంజక, సుభిక్ష వైఎస్సార్ సీపీ పాలనను ప్రజలు మళ్లీ తప్పక ఆశీర్వదించాలని ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు.రూ. 3 కోట్లతో ఆకుతీగపాడు నుంచి ముక్కేపురం మీదుగా కె. పెంటపాడును కలుపుతూ ఆర్అండ్‌బీ రహదారి పనులకు ఆకుతీగపాడులో శంకుస్థాపన, వల్లూరుపల్లి నుంచి రాచర్ల వరకు నిర్మించబోయే పంచాయతీ రహదారి పనులకు, కొండేపాడు నుంచి కోరిమిల్లి వరకు నిర్మించబోయే మరో రహదారికి పనులకు మంత్రి గురువారం శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ గతంలో ఎమ్మెల్యేగా ఉండగా వేసిన రహదారులు తప్ప గత పదేళ్లలో రెండు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన ఇతర పార్టీల ప్రజాప్రతినిధులు గ్రామాల అభివృద్ధిని మరిచారన్నారు. ఎన్నో హామీలు ఇచ్చి నెరవేర్చని అబద్దాల కోరుగా చంద్రబాబు, ఒక కులానికి, ప్యాకేజీకి అమ్ముడుపోయి, చంద్రబాబును ముఖ్యమంత్రిని చేద్దామనుకొంటున్న స్వార్థపరుడైన పవన్‌కు రాష్ట్ర ప్రజల ప్రయోజనాలు పట్టవన్నారు. కేవలం అధికారం కోసం ఎన్నో అడ్డదారులు తొక్కుతున్నారన్నారు. ప్రజలు వీటిని గమనిస్తూనే ఉన్నారన్నారు. సీఎం జగన్‌కు వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు కుట్ర రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. మండల పార్టీ అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, వైస్ చైర్మన్ చోడగిరి చినబాబు, కర్రి భాస్కరరావు, కళింగ కార్పొరేషన్ చైర్మన్ సంపతరావు కృష్ణారావు, పసల చంటి, వల్లూరి బ్రహ్మానందం, సొసైటీల అధ్యక్షులు బూరాడ శ్రీనివాస్, కుంచే సుబ్రహ్మణ్యం, కై గాల గణపతి, వైఎస్ ఎంపీపీలు కొణతాల వెంకట్రావు, ముప్పిడి సరోజిని, సర్పంచ్‌లు పెన్నాడ సూరిబాబు, గేదల శివకుమార్, దాసం వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యులు, దెయ్యం శ్రీనివాసరావు (అవతారం), దేవాబత్తుల నాగమణి, రెడ్డి సూరిబాబు, బొచ్చెల తాతారావు, పార్టీ నాయకులు కట్టుబోయిన కృష్ణప్రసాద్, నల్లమిల్లి విజయానందరెడ్డి, వల్లూరుపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యురాలు మడిపల్లి పుష్పావతి, కొవ్వూరి బాస్కరరావు, వసంతాడ జోగింద్ర కుమార్, దేవాబత్తుల బాబి, తోట నిరీక్షణరావు, బోణం వీరయ్య తదితరులు పాల్గొన్నారు.